ప్రజాశక్తి
ఆదివారం 25 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి



ఉద్యానపంటల సాగుకు ప్రోత్సాహం

కలెక్టర్ టిఎస్.చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047లో భాగంగా ఉద్యానవన పంటలకు అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులు తగిన ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో కొన్ని ముఖ్యమైన పంటలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేస్తోందన్నారు. జిల్లాలో టమోటా, మామిడి, వక్క పంటలను అభివృద్ధి చేసేందుకు నాలుగు విభాగాలుగా ఎంపిక చేశామన్నారు. ఈ పంటల సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించనున్నట్లు చెప్పారు. ఉద్యానవన ఉత్పత్తులను ఒకచోట చేర్చి వాటిని గ్రేడింగ్ చేయడం, ఉత్పత్తులను అమ్మడం, మార్కెట్ యార్డుల నిర్మాణం తదితర వాటిపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలియజేశారు. బుక్కపట్నం మండలంలో అత్యధికంగా మామిడి సాగు ఉన్న నేపథ్యంలో అక్కడ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, మండల అధికారి నవీన్ కుమార్, మార్కెటింగ్ జిల్లా అధికారి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణకు ప్రత్యేక చర్యలు : కలెక్టర్

జిల్లాలో అతిసార వ్యాధి ప్రబలకుండా ఆరోగ్య, పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈనెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా శాఖ అధికారి ఉదయ్ భాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ధ్యాన్ చంద్ హాకీ క్రీడాకారుడిగా ఒలంపిక్‌లో మూడు పతకాలు దేశానికి అందించారన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతి రోజును పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 27న రామగిరి మండల కేంద్రంలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 28వ ధర్మవరం ఉన్నత పాఠశాలలో హాకీ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయన్నారు. 29న బుక్కపట్నంలో ర్యాలీ, పుట్టపర్తిలో ధ్యాన్ చంద్ జయంతి వేడుకలతో పాటు ప్రముఖ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఐఎబి ఎప్పుడో..!

◆ ఇప్పటికీ ఆయకట్టు ప్రణాళిక లేదు ◆ సందిగ్ధ స్థితిలో రైతులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటిపై సందిగ్ధ స్థితిలో అనంతపురం జిల్లా రైతాంగం ఉన్నారు. ఒకవైపు ప్రకృతి సహకారం లేకుండా ఉంది. ఏ సమయంలో వర్షమొస్తుందో.. ఎప్పుడు రాకుండా ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. జూన్‌లో మంచి వర్షాలు పడితే, జులైలో పూర్తిగా వర్షాభావం నెలకొంది. ఇప్పుడు ఆగస్టులో అధిక వర్షాలు ఈ వారం రోజుల్లో పడ్డాయి. ఇంకోవైపు మంచి వర్షాలతో ప్రాజెక్టుల్లోకి నీరొచ్చి చేరింది. తుంగభద్ర డ్యామ్, ఇటు శ్రీశైలం డ్యామ్ రెండింటి నుంచి తగినంత నీరు తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో ఈసారి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీళ్లు ఎన్ని వస్తాయన్న సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి. డ్యామ్ గేటు మరమ్మతులు జరగడం కొంత ఊరటనిచ్చే అంశమనే చెప్పాలి. జిల్లాలోని ఆయకట్టుకు ఏ రకంగా నీళ్లు ఇవ్వనున్నారన్నది తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా మిడ్‌పెన్నార్ కిందనున్న ఉత్తర, దక్షిణ కాలువల కిందనున్న ఆయకట్టు రైతుల్లో ఈ గుబులు నెలకొంది. గతేడాది వర్షాభావంతో ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందలేదు. నీళ్లు అందలేదని అప్పటి ఎమ్మెల్యే కొన్నలగడ్డ పద్మావతి సైతం నేరుగా ప్రస్తావించడం గమనార్హం. ఇప్పుడు ఈ ఏడాది ఏ ప్రాంతానికి ఏ ఆయకట్టుకు నీరు ఏ సమయంలో ఇవ్వాలని తేల్చాల్సింది ఐఎబి (సాగునీటి సలహా మండలి) సమావేశంలోనే. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ దీనిపై ఇప్పటికీ దృష్టి సారించినట్టు కనిపించడం లేదు. తుంగభద్ర డ్యామ్ గేటు పోయి నీరు వృథాగా పోయిన నేపథ్యంలో ఈసారి జిల్లాకు ఎన్ని నీళ్లు వస్తాయన్న దానిపై స్పష్టత లేదు. అంతకు మునుపున్న అంచనా ప్రకారం జిల్లాకు 26 టిఎంసిలు తీసుకోవచ్చునని అంచనా వేశారు. నీరు వృథాగా పోయాక వచ్చేది ఎంతన్న గందరగోళం రైతుల్లో ఉంది. ఇప్పటికీ జిల్లాలోని ప్రధాన జలాశయాలైన పిఎబిఆర్, మిడ్‌పెన్నార్‌లో నీరు పూర్తి స్థాయిలో లేవు. వీటిని ఏ మేరకు నింపగలుగుతారు. అదే రకంగా ఆయకట్టుకు ఎంత నీరివ్వాలన్న అంచనాలను రూపొందించి, సర్దుబాటుగా ప్రణాళికలు రూపొందించాల్సింది ఐఎబి సమావేశంలోనే. ఇప్పటి వరకు ఐఎబి సమావేశం నిర్వహించలేదు. అటు హంద్రీనీవా నీరు కూడా జిల్లాకు వస్తున్నాయి. ఈ నీటిని అటు అనంతపురంతోపాటు, సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రణాళిక కూడా అక్కడే జరగాల్సి ఉంటుంది. అధికారపార్టీ నేతలేమీ ఇంకా సమయముందని దాటవేతధోరణితో ఉన్నట్టు తెలుస్తోంది. ఎగువన్న ప్రాంతాలకు ఈ సమస్యలేకపోవచ్చుగానీ, దిగువనున్న శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో రైతాంగానికి నీటి విడుదలపై ఆందోళన నెలకొంది. వచ్చే నీటిని అంచనా వేసి తాగు, సాగునీటికి కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. పూర్తి సమయం దాటిపోయాక సమావేశం నిర్వహించుకున్నా ప్రయోజనం ఏముంటుందన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం దీనిపై మౌనంగా ఉండటం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో అంగన్వాడీ కార్యకర్త మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంగన్వాడీ కార్యకర్త రంగమణి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మానేసముద్రం, కగ్గలు, నరసాపురం అంగన్వాడీ కార్యకర్త రంగమణి (55) శనివారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. కగ్గలు నుంచి హిందూపురం వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనం నుంచి జారీ పడింది. దీంతో ఆమె తలకు గాయం అయ్యి మరణించింది. ఈ విషయం తెలుసుకున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లావణ్య, ఉమాదేవి, పద్మ, జయమ్మలు ఆమె నివాసానికి వెళ్లి సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా అంగన్వాడీలో పని చేస్తున్న కార్యకర్త చనిపోతే కనీసం మట్టి ఖర్చులకు కూడా డబ్బులు లేని దౌర్భాగ్య స్థితిలో అంగన్వాడీ జీవితాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మట్టి ఖర్చులకు డబ్బులిస్తామన్న జీవోను వెంటనే విడుదల చేయాలని కోరారు.



జడ్జికి నరసింహస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అర్చకులు

ఖాద్రీశున్ని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఎపి హైకోర్టు న్యాయమూర్తి సుజాత దర్శించుకున్నారు. జడ్జికి ఆలయ అధికారులు తూర్పు రాజగోపురం వద్ద నుంచి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమె ముందుగా ధ్వజ స్తంభానికి మొక్కి అనంతరం ఆలయంలో అమ్మవారు, శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు జడ్జికి స్వామివారి చిత్రపటం అందజేసి, శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసా దాలు అందజేశారు. జడ్జి వెంట కదిరి కోర్టు న్యాయమూర్తి, ఆలయ కార్యనిర్వహణ అధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, ఉప ప్రధాన అర్చకలు ఎ.కుమార్ రాజాచార్యులు, ఆలయ అధికారులు ఉన్నారు.

మట్టి మాఫియాపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

మట్టి మాఫియాను అరికట్టాలని కోరుతూ శనివారం గాండ్లపెంట మండలంలోని వీరన్నగట్టుపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మట్టి మాఫియా గ్రామ శివారులోని కొండ గుట్టల నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తోందన్నారు. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుండడంతో గ్రామాలకు వెళ్లే రోడ్లు సైతం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. వినతి ఇచ్చిన వారిలో జి.ఆంజనేయులు, బయప్ప, మాజీ ఎంపీటీసీ వీరమనాయుడు, నారాయణస్వామి, నాగరాజు, అశోక్, అమరనాథ్, నరసింహులు, హరి ఉన్నారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రొద్దం

బాలికల రక్షణ మనందరి బాధ్యత అనిపెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ శాంతలక్ష్మి తెలి పారు. మండలంలోని పెద్దమంతూరు గ్రామ జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఆర్‌డిటి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన 'బాలికలను రక్షిద్దాం-బాలికలను చదవనిద్దాం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ శాంతలక్ష్మి, ఆర్‌డిటి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున హాజరయ్యారు. సిడిపిఒ మాట్లాడుతూ ఆడ పిల్లలు బాగా చదువుకోవాలని, పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉంటూ ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. బాల్య వివాహం గురించి తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, టీం లీడర్ ఆదినారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమీలమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ముజఫర్ హుసేన్, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, మహిళా పోలీసు నాగరత్నమ్మ, ఎఎన్‌ఎం పుష్ప, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

వేతనాలను విడుదల చేయండి : సిఐటియు



తహసీల్దార్ కు వినతిని ఇస్తున్న శ్రీరామి రెడ్డి వాటర్ వర్క్ కార్మికులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శ్రీ రామిరెడ్డి తాగునీటి సరఫరా పతకంలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి, తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రాము మాట్లాడుతు ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత 12 సంవత్సరాలుగా నీలకంఠాపురం, శ్రీ రామిరెడ్డి తాగునీటి సరఫరా పథకాల్లో 600 మంది కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. వీరికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం నుంచి నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. వేతనాల కోసం ప్రతి నెలా కార్మికులు ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సమస్యలపై ప్రభుత్వం, అధికారులు స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ రెడ్డి నీటి సరఫరా యూనియన్ అధ్యక్షులు సోమశేఖర్, ఉపాధ్యక్షులు మురళి, గిరీష్, బాలకష్ణ, మహానంది, జబివుల్లా, దళిత సమైక్య జిల్లా అధ్యక్షులు నారాయణ, మున్సిపల్ యూనియన్ నాయకులు రామాంజినప్ప, చంద్ర, పెద్దప్పయ్య, వెంకటరమణ, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

టాటా ఏస్ గూడ్స్ డ్రైవర్స్ యూనియన్ ఏర్పాటు

పట్టణంలో టాటా ఏస్ గూడ్స్ డ్రైవర్స్ యూనియన్‌ను సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. యూనియన్ బోర్డును సిఐటియు సీనియర్ నాయకులు అతిక్ ప్రారంభించారు. టాటా ఏస్ గూడ్స్ యూనియన్ కార్యదర్శిగా రియాజ్, అధ్యక్షులుగా మహేష్, ఉపాధ్యక్షులుగా రాము, జాయింట్ సెక్రెటరీగా రెహమాన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు హిందూపురం పట్టణ నాయకులు రామకష్ణ, రాము, ఆటో యూనియన్ నాయకులు రామాంజనేయులు, ఆదినారాయణ, నారాయణప్ప, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి శుద్ధ జలం అందిద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి శుద్ధి చేసిన తాగునీరు అందిద్దామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులకు సూచించారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అతిసార ప్రబలకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో తాగునీటి పైపులైన్లకు లీకేజీ లేకుండా చూడాల న్నారు. ప్రతి అధికారి బాధ్యతగా పని చేసేలా శాఖల వారీగా అధికారులతో బృందాల ఏర్పాటు చేయాల న్నారు. రెండు రోజుల్లో సమన్వయం చేసుకొని అధికారులు రొళ్ల, గుడిబండ మండలాల్లో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. అతిసార ప్రబలకుండా ఇప్పటికే అందరూ బాగా పనిచేశారని, ముమ్ముందు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ ఉద్యోగులను భాగస్వాములను చేసుకుని అతిసార నివారణకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, డిఇ మనూనాయక్, ఎంపీడీవో సోనీబాయి, ఎఇలు, అధికారులు పాల్గొన్నారు.

కారు ఆపి సమస్యలు ఆలకించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మడకశిరకు కారులో వస్తుండగా చౌటిపల్లి కాలనీలో రోడ్డు పక్కన నిల్చున్న మహిళల వద్ద కారు ఆపి కాలనీ సమస్యలు తెలుసుకున్నారు. వీధిదీపాలు, తాగునీటి సమస్యలను వారు ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం ఉదయాన్నే అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానన్నారు. వీధి దీపాలను త్వరలోనే ఏర్పాటు చేయిస్తానని, తాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సమస్యల వలయం.. వసతి గృహం..!

◆ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఇబ్బందులు ◆ చీకట్లోనే కొనసాగుతున్న చదువులు ◆ కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

గదుల్లో విద్యుద్ దీపాలు లేక చీకట్లో ఉన్న కదిరి బిసి బాలుర సంక్షేమ వసతి గృహం



పేద విద్యార్థులకు వసతి గృహాలు ఎంతగానో తోడ్పాటును అందిస్తాయి. చదువుతో పాటు వసతి సౌకర్యం ఉండడంతో చాలా మంది పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు వారి పిల్లలను వసతి గృహాల్లో చేరుస్తారు. తమ పిల్లల బాగోగులు అక్కడ బాగా ఉంటాయన్న నమ్మకంతో వారిని హాస్టళ్లలో చేర్పిస్తారు. కష్టాలను ఎదురీది బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశించే విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు అడుగడుగునా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇలా కదిరిలోని బిసి బాలుర సంక్షేమ వసతి గహంలో సరైన సౌకర్యాలు లేక అక్కడ ఉండే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల నడుమ హాస్టల్‌లో ఉండాలంటేనే ఆలోచన చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కనీస వసతులు కరువు

కదిరి బిసి బాలుర సంక్షేమ వసతి గృహంలో కనీస వసతులు కరువయ్యాయి. మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చిమ్మ చీకట్లలోనే రాత్రివేళ చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్ల అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఏడాదికి ఒక్కసారి కూడా వాటిని శుభ్రం చేయని పరిస్థితి కన్పిస్తోంది. మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేవు. తలుపులు లేని మరుగుదొడ్లలోనే విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. వీటిని తరుచూ శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు అంటువ్యాధులకు గురవుతున్నారు.

పిచ్చి మొక్కలు.. దోమలు..

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తేమశాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో దోమల వ్యాప్తి పెరిగింది. హాస్టళ్లలో దోమలు అధికం కావడంతో విద్యార్థులు గదుల్లో ఉండలేక పోతున్నారు. కనీసం ఫ్యాన్లు కూడా తిరగకపోవడంతో దోమలకాటుకు గురి కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక వసతిగహం ఆవరణంలో పిచ్చి మొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగాయి. వీటిలో క్రిమికీటకాలు, విషసర్పాలు సంచరించే అవకాశం కూడా ఉంది. రాత్రి వేళలో హాస్టల్ ఆవరణంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో విద్యార్థులు విషపురుగులు కాటుకు గురయ్యే ప్రమాదాలు ఉండడంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.





హాస్టల్‌లో తలుపులు లేక అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

సమస్యలున్న మాట వాస్తవమే

వసతి గహంలో వసతులు లేని మాట వాస్తవమే. గత ప్రభుత్వంలో హాస్టళ్ల నిర్వహణకు సంబంధించిన డబ్బులు రాలేదు. నూతన ప్రభుత్వమైన విద్యార్థుల సమస్యలను దష్టిలో పెట్టుకుని వసతి గహాల నిర్వహణకు సంబంధించిన డబ్బులను మంజూరు చేస్తే కొంతమేర ఇబ్బందులు తొలుగుతాయి.

బాలాజీ ఎబిసిడబ్ల్యుఒ, కదిరి.

అధికారుల మెరుగైన పనితీరుతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-పరిగి

మండలంలో అధికారుల పనితీరు మెరుగ్గా ఉంటేనే అభివృద్ధి కూడా అంతే వేగంగా జరిగే అవకాశం ఉందని స్థానిక మండల ప్రజా ప్రతినిధులు పలు శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపిపి సవిత ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొ చ్చారు. పశుసంవర్ధక శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల మండలంలోని బీచిగానిపల్లిలో ఐదు పాడిఆవులు మృతి చెందాయన్నారు. గ్లైకోస్ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని సర్పంచి బాలాజీ అధికారులను కోరారు. మట్టి, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందని పలువురు సర్పంచులు ఇరిగేషన్ డిఇ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకొచ్చారు. ఇటుక బట్టి నిర్వహణ వల్ల ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని ఉచితంగా మట్టిని అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో సరస్వతి, స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్‌రావు, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం, తదితరులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులు

బిఎస్ఎన్ఎల్ సేవలు మరింత విస్తృతం

ఎస్‌డిఇ క్రాంతి కుమార్



మాట్లాడుతున్న ఎస్‌డిఇ క్రాంతి కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో బిఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృతం చేయడానికి ప్రభుత్వం కషి చేస్తుందని పుట్టపర్తి సబ్ డివిజనల్ ఇంజనీర్ క్రాంతి కుమార్ తెలియజేశారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సిఎజి సభ్యులు జి.శారద పర్యవేక్షణలో పట్టణంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు గంగమ్మ, అనూష, రోజా, వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ పుట్టపర్తి సబ్ డివిజనల్ పరిధిలో 131 టెలికాం టవర్లు ఉన్నాయన్నారు. మరో 16 టవర్లు జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పుట్టపర్తి నియోజకవర్గంలో సాతర్లపల్లి, అమకొండ పాలెం, కింకిరివాండ్లపల్లి, వీరఓబులపల్లి, దొన్నికోట గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ నెలలో జిల్లాలో 4జి సేవలు అమల్లోకి వస్తాయన్నారు. ట్రాయ్ సిఎజి సభ్యులు శారద మాట్లాడుతూ మహిళలకు అనవసరంగా (అనుచిత) ఫోన్ కాల్స్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు 1909 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే సంబంధిత వ్యక్తుల ఫోన్ నెంబర్లను రెండు ఏళ్ల పాటు బ్లాక్‌లో పెట్టే అధికారం ట్రాయ్‌కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన సోషల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు హరికష్ణ, శివ, లక్ష్మి, బిఎస్ఎన్ఎల్ డిఈ పధ్వి ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, సిపిఎం నాయకులు

కొత్తచెరువు ప్రభుత్వాసుపత్రిలో మూడేళ్ల నుంచి పని చేస్తున్న ఆరుగురు మహిళా స్వీపర్లను విధుల నుంచి తొలగించడం సరైన పద్ధతి కాదని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్ట్ గడువు ఇంకా నెల ఉన్నప్పటికీ ప్రభుత్వం మార్పు వల్ల మహిళలపై వేధింపులకు పాల్పడుతూ వెంటనే మీరు వెళ్లిపోండని విధుల నుంచి తొలగించారన్నారు. ఈ విషయం బయట వ్యక్తులకు ఎవరికైనా చెబితే మీకు వచ్చే సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని కొందరు నాయకులు బెదిరించి ఐదు నెలలకు సంబంధించిన బకాయి వేతనాలు ఇవ్వకుండానే తొలగించారన్నారు. కాంట్రాక్టర్ వీరినే రెన్యువల్ చేసుకోవాలని రాతపూర్వకంగా అధికారికి ఇచ్చినప్పటికీ వాటిని ఖాతరు చేయకుండా స్థానిక రాజకీయ నాయకులు కక్ష కట్టి వీరిని తొలగించి రోడ్డు పాలు చేయడం బాధాకరమన్నారు. వీరిని విధుల్లోకి చేర్చుకోని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటంతో పాటు న్యాయపరమైన పోరాటం చేయడానికి కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ముత్యాలు, కో కన్వీనర్ శంకర్ రెడ్డి, చిన్న వెంకటేష్, శ్రావణి, బ్యాళ్ల అంజి, పెద్దన్న, తొలగించిన మహిళలు పాల్గొన్నారు.

సత్యసాయి విమానాశ్రయానికి పటిష్ట భద్రత

కలెక్టర్ టిఎస్.చేతన్


విమానాశ్రయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎయిర్ ఫోర్స్ అధికారులు, శ్రీసత్యసాయి ట్రస్టు సభ్యుల సమన్వయంతో సత్యసాయి విమానాశ్రయంలో పటిష్ట భద్రత కల్పిద్దామని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. స్థానిక విమానాశ్రయంలో శనివారం ఎయిర్‌పోర్టు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఛైర్మన్ హోదాలో కలెక్టర్ హాజరై భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ విమానాశ్రయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఏఏ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయం నిర్వాహకుల మధ్య పరస్పర సహకారం ఉండాలని, సమాచార బదిలీతో సమన్వయం చేసుకుంటూ భద్రతా ప్రమాణాలు పెంచాలని సూచించారు. అనంతరం విమానాశ్రయం సిబ్బంది ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్యాబిన్‌ను పరిశీలించారు. సమావేశంలో డైరెక్టర్ వీరరాఘవ గ్రూప్ కమాండ్, విమానాశ్రయం డైరెక్టర్ సాయినాథరెడ్డి, అడ్మిన్ లక్ష్మీనారాయణ, ఆర్‌డిఒ భాగ్యరేఖ, డీఎస్పీ విజయకుమార్, ఫైర్ సేఫ్టీ అధికారి హేమాద్రిరెడ్డి, వీకే కద్దం, నరసింహయాదవ్, తహశీల్దార్ అనుపమ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే డిప్యూటీ సిఎం లక్ష్యం

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేసి గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లక్ష్యమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. పంచాయతీల నిధులను పక్కదారి పట్టించి వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. దీంతో గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీ వ్యవస్థను పునరుద్ధరిస్తామన్నారు. ఎన్‌ఆర్‌ఈజిఎస్‌లోని 46 రకాల పనుల గురించి గ్రామస్తులకు అవగాహన లేదని, శుక్రవారం జరిగిన గ్రామసభలతో ప్రజలకు అవగాహన వచ్చిందన్నారు. భవిష్యత్తులో పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేసి గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఒకే రోజే గ్రామసభలు నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. ప్రధానమంత్రి మోడీ సహకారంతో త్వరలో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తారన్నారు.

పాలపాటిదిన్నె ఆలయానికి రూ. 2 లక్షల విరాళం

ప్రజాశక్తి-నల్లచెరువు

ప్రసిద్ధ పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో ఉచిత అన్నదాన కార్యక్రమానికి శనివారం ఎపిజిబి కదిరి, నల్లచెరువు శాఖల మేనేజర్లు రూ. 2 లక్షల విరాళం ప్రకటించినట్లు నల్లచెరువు ఎపిజిబి సీనియర్ మేనేజర్ ప్రభావతి తెలిపారు. మేనేజర్లు, రిటైర్డ్ మేనేజర్ల అభిప్రాయాల మేరకు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిజిబి రీజినల్ మేనేజర్ టి.రమేష్, రిటైర్డ్ రీజినల్ మేనేజర్ లక్ష్మీనరసయ్య, సీనియర్ మేనేజర్ నిత్యకుమార్, కదిరి ఎంజి రోడ్ చలపతి, గోవిందు, నల్లచెరువు బ్రాంచ్ సీనియర్ మేనేజర్ పాల్గొన్నారు. శ్రావణ మాసంలో మూడవ శనివారం కావడంతో స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కదిరి ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేకంగా బస్సులను నడిపారు. స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపులో యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ కల్పనరెడ్డి, రామచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వైద్య సిబ్బంది, అర్చకులు ఆంజనేయదాస్, రెడ్డప్ప, నాగరాజు, నల్లచెరువు ఎస్ఐ కెఎం.లింగన్న పాల్గొన్నారు

అవార్డు గ్రహీతలకు సన్మానం

గోరంట్ల : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ పుట్టపర్తిలోని పోలీస పరేడ్ మైదానంలో నూర్‌మహమ్మద్, నాగరాజు, పద్మజ, అరుణకుమారి కలెక్టర్ టిఎస్.చేతన్ నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను శనివారం స్థానిక ఉదయ్ కిరణ్ పాఠశాలలో ప్రయివేట్ స్కూల్స్ సంఘం ఆధ్వర్యంలో కరస్పాండెంట్లు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒలు రెడ్డప్ప, గోపాల్, ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు గౌస్‌బాషా, లక్ష్మీపతి, మధుసూదన్, ప్రవీణ్, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాగేంద్ర, అల్లా బకాష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లెలవాండ్లలో పశువైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు : మండలంలోని మల్లెలవాండ్ల గ్రామంలో శనివారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహిం చారు. శిబిరంలో పశువులకు వైద్యసేవలతో పాటు ఉచితంగా మందులు ఇస్తామని కార్య నిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 90 శాతం కచ్చితత్వంతో పెయ్య దూడల పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సి.ప్రవీణ్‌కుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.


పాంచజన్య పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



ఎల్‌ఆర్‌జి పాఠశాలలో చిన్నారులతో హెచ్‌ఎం ప్రసాద్, బ్రహ్మకుమారీలు

పాఠశాలల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికలు, యశోధ వేషధారణలో అలరించారు. ఉట్టి కొట్టే వేడుకలను పాంచజన్య శ్రీనివాసలు ప్రారంభించారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకృష్ణలీలలు మన జీవితానికి అన్వయించుకుని మంచి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నందకుమార్, అకడమిక్ డైరెక్టర్ నందిత, స్మిత, ఎఓ భాస్కర్, హెచ్‌ఎం గాయిత్రి, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌జి పాఠశాలలో..

రూరల్ మండలంలోని కిరికెర వద్ద ఉన్న ఎల్‌ఆర్‌జి విద్యాలయలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషాధారణలో అలరించారు. హెచ్‌ఎం ప్రసాద్ శ్రీకృష్ణాష్టమి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఓ సంజీవరెడ్డి, రాజయోగిణి, సునంద బెహెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్మవరం టౌన్ : పట్టణంలోని కాకతీయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారులతో ఉట్టి కొట్టించడం, గోపికలతో వెన్న చిలికించడం వంటి ఘట్టాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ నిర్మలజయ చంద్రారెడ్డి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూపారాజా పిసిఎంఆర్ పాఠశాలలో..

మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పిసిఎంఆర్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడు కలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ హర్ష వర్ధన్, డైరెక్టర్లు రూపారాజాకృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో..

కొత్తచెరువు రూరల్ : స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానం గా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అట్టహాసంగా ఏర్పాటు చేశారు. పాఠశాల కోఆర్డినేటర్ ఇర్షాద్, శ్రీచైతన్య పాఠశాలల రీసోర్స్ పర్సన్‌ల బృందం, ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ రెడ్డి, డీన్ హనుమంతు, ఏవో కేశవరెడ్డి పాల్గొన్నారు.



రూపారాజా పిసిఎంఆర్ పాఠశాలలో శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు

జీవో - 84 రద్దుచేయాలి



ఎంఇఒలకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మున్సిపల్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీవో నెంబరు 84ను రద్దు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ఎపిఎంటిఎఫ్ గౌరవాధ్యక్షుడు రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగోన్నతులు, బదిలీలు లేకుండా స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ఇతర మేనేజ్మెంట్ల ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులు, బదిలీలు పొందారని, మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖ ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులుగా పరిగణిస్తోందన్నారు. కావున జీవో నెంబరు 84ను రద్దు చేసి ప్రతి మున్సిపాలిటీకి మున్సిపాలిటీలోని సీనియర్ ఉపాధ్యాయులును ఎంఇఒగా నియమించాలని, మున్సిపల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని వేరుగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలోని మాధ్యమిక, ఉన్నత పాఠశాలలకు సాంక్షన్ పోస్టులు కేటాయించాలన్నారు. బలవంతంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వల్ల బోధనలో నాణ్యతా ప్రమాణాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే మున్సిపాలిటీ పాఠశాలల్లో ఉద్యోగోన్నతులు, బదిలీలు నిర్వహించి ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ద్వారా నింపి విద్యార్థుల భవిష్యత్తుకి సహకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన ఫ్యాప్టో పట్టణ కార్యదర్శులు రవీంద్రారెడ్డి, రామకృష్ణ, నాగప్ప, ఉమాపతి, జగదీశ్, సాలు గణేశ్ ఉన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితులను శిక్షించాలి

జాతీయ చేనేత నాయకురాలు సంకారపు జయశ్రీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఈ నెల 9వ తేదీ కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితు లను కఠినంగా శిక్షించాలని జాతీయ చేనేత నాయకురాలు సంకారపు జయశ్రీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లను డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆమె మాట్లాడుతూ దేశంలో ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయని, కోల్‌కతా ఘటన బాధాకరం, దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశా రు. దేశం, రాష్ట్రంలో ఎన్ని చట్టాలు ఉన్నా మహిళలపై హింస, దాడులు, హత్యలు జరగడం ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా కేంద్రం నూతన చట్టాలు తీసుకురావాలన్నారు. పటిష్టమైన చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటేనే మహిళలకు రక్షణ, భద్రత కలుగుతుందని తెలిపారు. జూనియర్ డాక్టర్ మృతికి కారుకులైన వారికి యావజ్జీవ కారాగార శిక్ష చాలదని, ఉరి తీయాలని డిమాండ్ చేశారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పాటు రాణిస్తున్నారని, ఇలాంటి తరుణంలో కూడా మహిళలపై దాడులు, లైంగిక హింసలు, హత్యలు జరుగుతున్నాయంటే సమాజం ఎటువైపు వెళ్తోందనని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళను గౌరవించే దిశగా అందరూ కట్టుబడి ఉండాలన్నారు. అభం, శుభం తెలియని చిన్నారులపై కూడా లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరగడం దురదృష్టకరమన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన అవసరం : ఎస్ఐ


ఎంఇఒలకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అమరాపురం

పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ జనార్ధన్‌నాయుడు సూచించారు. మండలంలోని హలుకురు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం ప్రిన్సిపల్ పద్మావతి అధ్యక్షతన విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ 2012లో వచ్చిన పోక్సో చట్టం 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికలపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్ష అమలయ్యేలా ఈ చట్టాన్ని రూపొందించారన్నారు. వారిపై అత్యాచారానికి పాల్పడిన దోషులకు మరణశిక్ష విధిస్తారన్నారు. ఈ చట్టం గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం గురించి తెలిస్తే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రామాంజనేయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సకాలంలో ఇంటి, నీటి, కుళాయి, ఖాళీ జాగా పన్నులు చెల్లించి మున్సిపాలిటీకి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి జాతీయ ప్రధాన రహదారి మీదుగా ప్రజా చైతన ర్యాలీ పట్టణంలో నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సంఘటితం కావా లని పిలుపునిచ్చారు. పన్నులు చెల్లించడంతో పాటు పరిశుభ్రత పాటించాలని ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. మురికి కాలువల్లో చెత్త చెదారం వేయకుండా చెత్త వాహనాలు వచ్చినప్పుడు వారికి అందజేయాలన్నారు. సిఐ నారాయణరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వ్యాపారులు సహకరించి ఆదర్శ పట్టణంగా కదిరి మున్సిపాలిటీని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో సంబంధిత అధికారులు, మున్సిపల్ కార్యదర్శి, సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'సే నో టు డ్రగ్స్' గోడపత్రిక విడుదల



'సే నో టు డ్రగ్స్' గోడపత్రికను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట


ప్రజాశక్తి-కదిరి అర్బన్

యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన పరిచేందుకు టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్, డ్రగ్స్ మహమ్మరిని తరిమికొడదాం' పోస్టర్లను ముద్రించారు. ఈ గోడ పత్రికలను శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పట్టణంలోని తన కార్యాల యంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం మత్తు పదార్థాలను పెంచి పోషించడం వల్ల యువత వాటికి అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తు కోసం మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట వేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. కదిరిలో కూడా మత్తు పదార్థాల నివారణకు చర్యలు చేపట్టామని తెలిపారు. నియోజకవర్గంలో యువత జీవితాన్ని మంచి మార్గంలో నడిపేందుకు టిఎన్ ఎస్ఎఫ్ చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు పనిముట్లు అందించాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని కోరుతూ శనివారం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జగన్మోహన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం పనులు చేయాలంటే పనిముట్లు, పరకలు, పారలు, గ్లౌజులు, నూనె, తదితర పనిముట్లు ఇవ్వాలని కోరారు. అలాగే కరోనా సమయంలో పని చేసిన కార్మికులందరినీ పనిలోకి తీసుకోవాలని కమిషనర్‌కి విన్నవించారు. కార్యక్ర మంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జనార్ధన, బాలకృష్ణ, తిరుపాలు, సూరి, సిఐటియు నాయకులు బాబ్‌జాన్ పాల్గొన్నారు.


కమిషనర్ కిరణ్‌కుమార్‌కి వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

మంత్రి సవితను కలిసిన ఎమ్మెల్సీ

పెనుకొండ : బిసి సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవితను శనివారం ఎమ్మెల్సీ బిటి నాయుడు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మంత్రికి పూలబొకే అందజేసి అభినందించారు. వారు పలు అంశాలపై చర్చించారు. వారితో పాటు నాయకులు నారాయణస్వామి, వెంకటరమణ, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, నరహరి, డివి ఆంజనేయులు, మావటూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'సత్యసాయి' కార్మికుల సమ్మె

కొత్తచెరువు రూరల్ : మండలంలోని కేశపురం సమీపంలో ఉన్న సత్యసాయి నీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజూ కొనసాగింది. ఆ సంఘం కోశాధికారి రాము మాట్లాడుతూ బోర్డులో నిధులు లేక ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. కనీస మరమ్మతులు కూడా చేయలేక పోతున్నామన్నారు. సమస్యను గతంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించామని తెలిపారు. ఎవరూ స్పందించకపోవడంతో సమ్మె చేస్తున్నామని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

అదును దాటాక పదును

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అదును దాటక పదునైంది. ఈ వారంలో జిల్లాలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంది. గతేడాది లాగానే ఈసారి కరువు పరిస్థితులే నెలకొంటాయా అన్న సందేహం నెలకొంది. ఈ వారంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానూ విస్తారంగా వర్షాలు పడ్డాయి. సాధారణం కంటే 200 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. అంతకు మునుపు జూన్ నెలలోనూ సాధారణం కంటే అధికంగా వానలు పడ్డాయి. జూన్‌లో 147 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. జులై నెలలో 60 శాతం లోటు వర్షపాతం పడింది. వర్షాధారంపై సాగయ్యే ఈ ప్రాంతంలో జులై నెల కీలకం కావడం గమనార్హం. ఎందుకంటే వేరుశనగ సాగుకు అదే అనువైన సమయం. ఆగస్టు మొదటి వారం తరువాత విత్తనం విత్తుకుంటే చివర్లో వర్షాలు తగ్గుతాయి కాబట్టి దిగబడులు కూడా సరిగా రావాని రైతులు విత్తనం విత్తుకోరు. ఈ పదునులో ప్రత్యామ్నాయ పంటలు సాగుకు అనుకూలం. కాకపోతే ప్రభుత్వం అందుకు తగ్గట్టు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికీ ప్రత్యామ్నాయ విత్తనాలు సిద్ధం చేసి ఉంటే రైతులు ఈ తేమలో విత్తనం విత్తుకునే వారు. కాని 80 శాతం సబ్సిడీ అయితే ప్రకటించింది కాని ఇప్పటి వరకు పంపిణీని మాత్రం మొదలు పెట్టలేదు. దీంతో రైతులు తమ సొంత ప్రయత్నాల్లో ఉంటున్నారు. ఈ వర్షాలకు చాలా చెరువుల్లోకి నీరు వచ్చి చేరడం సంతోషించదగిన విషయం.

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయి నీరు వృథాగా పోతున్న విషయం తెలిసిందే. ఈ వారంలో దాని అరికట్టే ప్రయత్నాలు చేయడంలో ఇంజినీర్లు సఫలమయ్యారు. మరోమారు ఇన్‌ఫ్లోస్ కూడా డ్యామ్‌కు వస్తుండటం సంతోషించదగిన విషయం. ఇంకోసారి వానలొచ్చి నిండితే నష్టపోయిన నీళ్లు తిరిగి పొందినట్టవుతుంది. ఇది సంతోషించదగిన విషయం. ఇక ఈ వారంలో రాజకీయంగానూ తాడిపత్రి మరోమారు భగ్గుమంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లిన సమయంలో టిడిపి నాయకులు, వారికి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో వాహనాలు, ఇళ్లు తగలబడ్డాయి. మరోసారి ఈ అంశం వార్తలొకెక్కింది. రాప్తాడులోనూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి సంబంధించిన సంస్థ ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా బిల్లులు తీసుకుందన్న అంశం ప్రధాన చర్చనీయాంశంగా ముందుకొస్తోంది. ఆ సంస్థ కేసు నమోదు చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. రాజకీయంగా ఇది చర్చనీయాంశంగా ఉంది. ఇదే క్రమంలో అంతకు మునుపున్న ఎస్పీ మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగదీశ్ నియమితుల వడమే కాకుండా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే జిల్లా ముఖ్య అధికారుల బదిలీలు పూర్తయ్యాయి. ఇక ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో బదిలీలకు ఉద్యోగులు తమతమ ప్రయత్నాలు ముమ్మరంచేసుకుంటున్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ మొత్తం వచ్చే వారంలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఉద్యోగులు పూర్తిగా ఈ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. తాము కోరుకున్న స్థానాలకు బదిలీ చేయించుకుని వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు.



నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న కారు.. మహిళ మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై శనివారం మండలంలోని లింగారెడ్డిపల్లి బస్టాప్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. తాడిమర్రి మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన చాకలి వెంకటనారాయణ, భార్య సరోజమ్మ, మనవడు చరణ్, మనవరాలు అలేఖ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై దైవదర్శనానికి బయల్దేరారు. మార్గమధ్యలో బత్తలపల్లి సమీపంలో బైక్‌లో పెట్రోలు పట్టించి అనంతపురం వెళ్లడానికి రోడ్డు క్రాస్ చేస్తుండగా బత్తలపల్లి నుంచి అనంతపురం వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో చాకలి సరోజమ్మ(40) అక్కడికక్కడే మృతి చెందగా భర్త వెంకటనారాయణకు, చిన్నారులు ఇద్దరూ గాయపడడంతో స్థానికులు హుటాహుటిన బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పరిగి : మండలంలోని సుబ్బరాయపల్లికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని అర్చన(16) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు మందలించడంతో అర్చన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల వాళ్లు గమనించి విద్యార్థిని కిందకు దించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

కొత్తచెరువు రూరల్ : మండలంలోని కొడపగానిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఓ రైతుకు తీవ్రంగా గాయపడ్డాడు. రైతు కుళ్లాయప్ప ఉదయం ఎద్దులబండిపై పొలం నుంచి వస్తుండగా ఓ లారీ వెనుక నుంచి అతి వేగంగా వచ్చి ఢీ కొంది. దీంతో బండిపై ఉన్న రైతు కుళ్లాయప్పకు, ఓ ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రైతును ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ వేగంగా రావడంతోనే ప్రమాదం జరిగిందని ప్రజలు లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

అగళి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ వి.రత్న ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. 3 నెలల క్రితం పోలీసులు దినేష్ అనే వ్యక్తి నుంచి ద్విచక్ర వాహనాన్ని జప్తు చేసుకున్నారు. రెండు రోజుల క్రితం స్టేషన్‌లో ఎస్ఐ లేని సమయంలో హెడ్ కానిస్టేబుల్ ఓ ప్రయివేటు మెకానిక్ షాపు వద్దకు జప్తు చేసిన వాహనాన్ని తీసుకెళ్లి అందులోని కొన్ని విడి భాగాలను తన వాహనానికి మార్పించాడు. ఇదంతా బైక్ యజమాని దినేష్ గమనించి హెడ్ కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. ఈ విషయంపై ఆ రోజే దినేష్ ఎస్ఐ వీరేష్, ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆక్రమణల తొలగింపు

కొత్తచెరువు : స్థానిక బిసి కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేస్తామని మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశాల మేరకు శనివారం జెసిబితో ఆక్రమణలను తొలగించామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు నల్లమాడ శంకర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సీసీ కెమోరాలు ఏర్పాటు చేస్తాం : డీఎస్పీ

హిందూపురం : తూమకుంట, కొడికొండ చెక్ పోస్టుల్లో ఉన్న పోలీస్ పాయింట్లలో అధునాతన సాంకేతికతతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ మహేష్ తెలిపారు. డీఎస్పీ శనివారం ఆ రెండు చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

కత్తెర పురుగును నివారిస్తే అధిక దిగుబడి:ఎడిఎ

హిందూపురం : మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును నివారిస్తే అధిక దిగుబడి రావడానికి సాధ్యం ఉందని ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఆయన శనివారం హిందూపురం, చిలమత్తూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ఐదు మండలాల్లో 8,087 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారని, పైరు వివిధ దశల్లో ఉందన్నారు. రైతులకు తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి సాధించేందుకు మందులను సూచించారు.

ఆదేపల్లితండాలో వైద్యశిబిరం

చిలమత్తూరు : మండలంలోని ఆదేపల్లితండాలో శనివారం సంతేబిదునూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనురాధ, వైద్య సిబ్బంది సోమశేఖర్, పార్వతమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు డ్రమ్ములు పంపిణీ

పెనుకొండ : మండలంలోని శెట్టిపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు శనివారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా టార్పాలిన్, డ్రమ్ములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి సారయ్య, టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, ఎన్‌ఎఫ్ఎ సాకప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

చిలమత్తూరు : మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మునీర్ అహ్మద్ హెచ్చరించారు. ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి శనివారం కొడికొండ చెక్‌పోస్టులో కర్నాటకలోని బాగేపల్లి వైపు నుంచి వచ్చే వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడపడం ద్వారా అత్యధికంగా ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. హిందూపురం డీఎస్పీ కెవి మహేష్ కొడికొండ చెక్‌పోస్టును పరిశీలించారన్నారు. చెక్‌పోస్టులో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు.